క్లుప్తంగా

సుప్రభాతం ఆడియో ఆవిష్కరణ రేపు


మాట్లాడుతున్న ఈఓ శ్రీనివాసరావు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో రామతీర్థ రఘు పుంగవ సుప్రభాతం ఆడియో ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఈఓ వై. శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ...ప్రముఖ సినీ సంగీత దర్శకుడు మాదవపెద్ది సురేష్ ఆధ్వర్యంలో వర్ధమాన గాయకులు పవన్, నిత్య సంతోషి, తదితరులు సుప్రభాతాన్ని ఆలపించారన్నారు. ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతి రాజు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆడియోను ఆవిష్కరిస్తారని తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరం

● సీఐ ఎన్‌వీ ప్రభాకర్


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ ప్రభాకర్

భోగాపురం: మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సీఐ ఎన్‌వీ ప్రభాకర్ సూచించారు. బుధవారం స్థానిక ఆదర్శ పాఠశాలలోని విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం, పొగ తాగడం వల్ల అనారోగ్య సమస్యలేర్పడతాయన్నారు. అలాగే గంజాయి, కొకైన్, హెరాయిన్, నల్లమందు, బ్రౌన్‌సుగర్‌వంటి మత్తు పదార్థాల జోలికెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పార్వతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పైడితల్లి ప్రసాదం తనిఖీ


నెయ్యి పరిశీలిస్తున్న అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఈశ్వరి

విజయనగరం: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పైడితల్లి ప్రసాదం నాణ్యతను ఫుడ్ సేఫ్టీ అధికారులు బుధవారం తనిఖీ చేశారు. భక్తులకు అందించే లడ్డూతో పాటు లడ్డూ తయారీకి వాడే నెయ్యి శాంపిల్స్‌ను అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఈశ్వరి ఆధ్వర్యంలో సేకరించారు. సేకరించిన శాంపిల్స్‌ను పరిశీలించిన తర్వాత నాణ్యతపై కలెక్టర్, ఫుడ్ సేఫ్టీ కమిషనర్‌లకు నివేదికలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నాగుల్‌మీరా పాల్గొన్నారు.

ఐసీఐ హరివిల్లు క్లబ్ ఏర్పాటు


క్లబ్ నూతన కమిటీ సభ్యులు వీరే..

విజయనగరం అర్బన్: ప్రముఖ సైకాలజిస్టు గంపా నాగేశ్వరరావు స్థాపించిన 'ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ (ఐసీఐ)' సేవా సంస్థకు అనుబంధంగా 'ఐసీఐ' హరివిల్లు నూతన క్లబ్‌ను ఏర్పాటు చేశారు. బుధవారం స్థానిక ఎస్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్‌కు సంబంధించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షుడిగా కేవీ సూర్యారామారావు, క్లబ్ సెక్రటరీగా జె.శ్రీనివాసరావు, కోశాధికారిగా కె.జయశ్రీ, మరో 18 మంది సభ్యులతో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఐసీఐ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, డాక్టర్ ఆర్‌వీఆర్ పాల్గొన్నారు.

వెంకట్ కుటుంబానికి న్యాయం చేయాలి

నెల్లిమర్ల: ఇటీవల మరణించిన నగర పంచాయతీ పారిశుధ్య కార్మికుడు బొమ్మాలి వెంకట్ కుటుంబానికి న్యాయం చేయాలని సీఐటీయూ నాయకులు టీవీ రమణ, ఎ. జగన్మోహనరావు డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నెల్లిమర్ల నగర పంచాయతీ కమిటీ ఆధ్వర్యంలో బొమ్మాలి వెంకట్ సంతాప సభ బుధవారం జరజాపుపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె. రామారావు, బాబూరావు, లక్ష్మి, సురేష్, ఉమా, రాము, బాల, గౌరి, ఇఫ్టూ నాయకులు అప్పలసూరి పాల్గొన్నారు.

ముగిసిన నియోజకవర్గ స్కూల్‌గేమ్స్ పోటీలు

విజయనగరం: నియోజకవర్గ స్థాయిలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్ క్రీడాకారుల ఎంపిక పోటీలు బుధవారంతో ముగిసాయి. నగర శివారులో గల విజ్జి స్టేడియంలో స్కూల్ గేమ్స్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కె.తాడుబాబు ఆధ్వర్యంలో జరిగిన ఎంపిక పోటీల్లో భాగంగా మూడో రోజు అథ్లెటిక్స్ క్రీడాంశంలో అండర్-14, 17 విభాగాల్లో 200 మంది బాల,బాలికలు పాల్గొన్నారు. వీరికి పరుగు, హైజంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, తదితర విభాగాల్లో ఎంపికలు నిర్వహించగా... ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలు పంపిస్తామని తాడుబాబు తెలిపారు. పోటీలు విజయవంతం కావడానికి సహకరించిన వ్యాయామ ఉపాధ్యాయులు, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వాడీవేడిగా కార్పొరేషన్ సమావేశం..


మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి


సాధారణ సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు

- యంత్రాంగం తీరుపై విరుచుకుపడిన కౌన్సిలర్లు
- మేయర్ పంపించిన్ కుళాయి కనెక్షన్ దరఖాస్తు తిరస్కరణపై మండిపాటు
- లోపాలు సరిదిద్దుకుంటామన్న కమిషనర్

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ సాధారణ సమావేశం వాడీవేడిగా సాగింది. నగర మేయర్ వెంపడావు విజయలక్ష్మి అధ్యక్షతన బుధవారం ఉదయం జరిగిన సమావేశంలో అజెండాలో పొందుపరిచిన 22 అంశాలతో పాటు టేబుల్ అజెండాగా తీసుకువచ్చిన మరోజూరు అంశాలపై కౌన్సిల్ సభ్యులు చర్చించారు. వీటిలో ఒక అంశం మినహా మిగిలిన అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సమావేశం ప్రారంభంలోనే జీరో అవర్‌లో సాక్షాత్తూ మేయర్ కుళాయి కనెక్షన్ కోసం దరఖాస్తు పంపిస్తే ఎమినిటీస్ కార్యదర్శి తిరస్కరించడం.. ప్రభుత్వం చేపడుతున్న మా మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ప్రొటోకాల్ పాటించకపోవడంపై అధికారుల తీరును కార్పొరేటర్లు తప్పుబట్టారు. కార్పొరేటర్ అల్లు చాణక్య మాట్లాడుతూ.. మా మంచి ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లను అగౌరవపరిచే సంఘటనలు జరుగుతున్నాయన్నారు. గౌరవ ప్రజాప్రతినిధులను కాదని కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలను వేదికలపైకి పిలిచి కూర్చోబెడుతుండడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదేనా ప్రజాప్రతినిధులకు ఇచ్చే గౌరవమంటూ ప్రశ్నించారు. అదేవిధంగా సచివాలయాల ద్వారా కుళాయి కనెక్షన్లకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని.. మరెవ్వరికీ దరఖాస్తులు ఇవ్వొద్దంటూ కమిషనర్ ప్రకటించడం సరికాదన్నారు. కుళాయి కనెక్షన్లను కార్పొరేటర్ల ద్వారా మంజూరు చేయాలని, లేకుంటే ఊరుకునేది లేదని కార్పొరేటర్లు స్పష్టం చేశారు.

లోపాలు సరిదిద్దుకుంటాం: కమిషనర్

కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ.. గౌరవ సభ్యులకు అగౌరవపరిచే విధంగా వ్యవహరించే అవకాశం లేదన్నారు. మా మంచి ప్రభుత్వం అనేది ప్రభుత్వం కార్యక్రమం కాబట్టి ప్రొటోకాల్ ప్రకారం నడుచుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులుగా కార్పొరేటర్లను అగౌరపరచమని, లోపాలు జరిగిఉంటే సరిదిద్దుకుంటామని తెలిపారు. కొత్తగా రావడం వల్ల ఇప్పుడిప్పుడే పాలనా తీరు, నగరంపై అవగాహన పెంచుకుంటున్నానని.. మూడు నెలల్లోగా అందరి సహకారంతో నగరాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అదేవిధంగా మరి కొంతమంది కార్పొరేటర్లు తాగునీరు సరిగ్గా రావడం లేదని.. బురదనీరు వస్తోందని.. నగరంలో పారిశుధ్య పనులు సక్రమంగా జరగడం లేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయాయాదవ్, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, అన్నిశాఖల అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

క్లాప్ డ్రైవర్లకు పెంచిన జీతం ఇవ్వాలి

- ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొరుమామిళ్ల సుబ్బారాయుడు


నిరసనలో పాల్గొన్న క్లాప్ వెహికల్ డ్రైవర్లు

విజయనగరం ఫూల్‌బాగ్: ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించే క్లాప్ వాహనాల డ్రైవర్లకు జీఓ 7 ప్రకారం పెంచిన జీతం ఇవ్వాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొరుమామిళ్ల సుబ్బారాయుడు డిమాండ్ చేశారు. క్లాప్ వెహికల్ డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం ఏపీ స్వచ్ఛాంధ్ర క్లాప్ వెహికల్ డ్రైవర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం దగ్గర నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎంతో చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లకు సరైన జీతం ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. రూ. 18,500 ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, కాంట్రాక్టరుల కొంత మింగేస్తూ కేవలం పది వేల రూపాయలు మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి పీఎఫ్, ఈఎస్ఐ, వీక్లీ ఆఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ మెంబర్ కల్యాణం అప్పలరాజు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్. రంగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్, జిల్లా ఉపాధ్యక్షుడు జలగడుగుల కామేష్, యూనియన్ జిల్లా అధ్యక్షుడు పొడుగు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి బంగారు శ్రీనివాసరావు, 60 మంది డ్రైవర్లు పాల్గొన్నారు.

ఆలయ భూముల్లో సర్వే


కోనాడ దేవాలయ భూముల సర్వేలో పాల్గొన్న ఈఓ జగదీశ్వరి , సచివాలయ సిబ్బంది

పూసపాటిరేగ: మండలంలోని కోనాడ వేణుగోపాలస్వామి, ఉమారామలింగస్వామి దేవస్థానం ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి ఎం. జగదీశ్వరి ఆధ్వర్యంలో ఆలయ భూముల్లో బుధవారం సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ, సర్వే నంబరు 113-1, 2,3,4లో గల 18.65 సెంట్లు భూమిని సర్వే చేసి శిస్తు వసూలు చేసినట్లు తెలిపారు. మరో 30 ఎకరాలకు సంబంధించి శిస్తు వసూలు చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బందితో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధం..

దేవస్థానం భూములకు సంబంధించి వేలంపాట నిర్వహించి శిస్తు వసూలు చేయాలి. కాని అటువంటిదేమీ లేకుండానే రైతులతో ఆలయ అధికారులు కుమ్మక్కై ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సుమారు 100 ఎకరాల దేవస్థానం భూమి ఉండగా కేవలం కొంత భూమికే శిస్తు వసూలు చేస్తున్నట్లు రికార్డులు చెబుతున్నాయి.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- డీఎంహెచ్‌ఓ భాస్కరరావు


రాకోడు పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం రూరల్: పీహెచ్‌సీకి వచ్చే రోగులకు సేవలు అందించడంలో ఎటువంటి జాప్యం వహించినా శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి భాస్కరరావు హెచ్చరించారు. మండలంలోని రాకోడు పీహెచ్‌సీని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. దేశ వ్యాప్తంగా వైద్యులు సమ్మెలో ఉన్నప్పటికీ రాకోడు పీహెచ్‌సీలో వైద్యులు మాత్రం విధుల్లో ఉండడంపై ఆయన అభినందనలు తెలిపారు. అలాగే జొన్నవలసలో జరుగుతున్న ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది కృష్ణ, చిన్నారావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

కూరగాయలు తప్పనిసరి..

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎర్రయ్యమ్మ


కార్యక్రమంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ ఎర్రయ్యమ్మ

విజయనగరం ఫోర్ట్: పిల్లలు తినే ఆహారంలో పప్పు దినుసులు, ఆకుకూరలు ఉండేవిధంగా చూసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గనివాడ ఎర్రయ్యమ్మ అన్నారు. పట్టణంలోని ధర్మపురి అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పిల్లలకు పౌష్టికాహారం అందించడం వల్ల రక్తహీనత బారిన పడరన్నారు. అనంతరం తక్కువ ఖర్చుతో పౌష్టికాహారం ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పి.శారద, దేవీబాయ్, రమాదేవి, సుగుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

నేడు బియ్యాలపేటలో గ్రామసందర్శన

విజయనగరం రూరల్: కలెక్టర్ ఆదేశాల మండలంలోని బియ్యాలపేటలో గురువారం గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రకళ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటలకు అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు. ప్రజలు వ్యక్తిగత, సామాజిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.

మొయిదలో..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని మొయిద విజయరామపురంలో గ్రామ సందర్శన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గిరిబాల ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు ఉదయం గ్రామంలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటారని, అనంతరం పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ నిర్వహిస్తారని పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో జూదరులు

పూసపాటిరేగ: మండల కేంద్రమైన పూసపాటిరేగ ఏతపేటలో పేకాటాడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఐ. దుర్గాప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, నిందితుల నుంచి 2,845 రూపాయలు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే సీహెచ్ అగ్రహారం సమీపంలో ఎటువంటి అనుమతి లేకుండా గ్రావెల్ తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్లు తెలిపారు. తిప్పలవలసలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున వ్యక్తి నుంచి 25 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సమావేశాలకు హాజరుకాకపోతే ఎలా..?

- మండల ప్రత్యేక అధికారి సుధారాణి


సమాశానికి హాజరుకాని అధికారుల వివరాలను ఏఓ బంగారయ్యను అడిగితెలుసుకుంటున్న మండల ప్రత్యేకాధికారి సుధారాణి

భోగాపురం: మండల స్థాయిలో జరిగే కీలక సమావేశాలకు హాజరు కాకపోతే ఎలా అని మండల ప్రత్యేక అధికారి సుధారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఈనెల 28న జరగబోయే హౌసింగ్ డే కార్యక్రమానికి సంబంధించి మండలంలో ఉన్న అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇందులో కొన్ని శాఖలకు సంబంధించి అధికారులు, సిబ్బంది రాకపోవడంతో ఆమె మండిపడ్డారు. సమావేశానికి ఎవరెవరు, ఎందుకు రాలేదో తెలుసుకుని పూర్తి వివరాలను తనకు తెలియజేయాలని మండల పరిషత్ ఏఓ బంగారయ్యను ఆదేశించారు. కార్యక్రమంలో రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లి జాతరకు ఏర్పాట్లు

- కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య


అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: అక్టోబర్ 15న నిర్వహించనున్న పైడితల్లి సిరిమాను జాతరకు సంబంధించి విజయనగరం కార్పొరేషన్ తరఫున పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడులాంతర్లు జంక్షన్ నుంచి కోట వరకు సిరిమాను తిరిగే ప్రాంతంలో శిథిల భవనాలను గుర్తించి భవన యజమానులకు నోటీసులు అందించాలని ప్రణాళిక అధికారులను ఆదేశించారు. అలాగే నిరంతరం పారిశుధ్య నిర్వహణకై అదనపు పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేయాలని ప్రజారోగ్యాధికారి కొండపల్లి సాంబమూర్తికి సూచించారు. మంచినీటి సరఫరాలో ఇబ్బందుల్లేకుండా చూడాలని.. వీధి దీపాలు వెలిగేలా పక్కా ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సమావేశంలో నెల్లిమర్ల కమిషనర్ బాలాజీ ప్రసాద్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అవగాహన తప్పనిసరి


బంటుపల్లిలో మాట్లాడుతున్న ఏరువాక కేంద్రం సమన్వయకర్త ఎస్.లక్ష్మణ్

డెంకాడ: పంటల సాగుపై రైతులకు పూర్తి అవగాహన అవసరమని విజయనగరం ఏరువాక కేంద్రం సమన్వకర్త ఎస్.లక్ష్మణ్ అన్నారు. మండలంలోని బంటుపల్లి, పినతాడివాడ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. బంటుపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఎరువులు, పురుగు మందులు మోతాదుకు మించి వాడరాదన్నారు. మొదటి దఫా, ఆఖరి దమ్ములో 25 కిలోల డీఏపీ, 20 కిలోల యూరియా వేయాలన్నారు. కలుపుతీసిన వారం రోజుల్లో 20 కిలోల యూరియా, చిరుపొట్ట దశలో 20 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్ వేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమాల్లో పినతాడివాడ సర్పంచ్ లెంక లక్ష్మణరావు, ఏఓ పూడి నిర్మల, కీటక శాస్త్రవేత్త ఎం.స్వాతి, పశువైద్యాధికారి ఎం.శ్రీకాంత్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చే నెల 6,7,8 తేదీలలో ఓక్ జూబ్లీ వేడుకలు

విజయనగరం అర్బన్: ఏపీటీఎఫ్ 80 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వచ్చే నెల 6,7,8 తేదీలలో పట్టణంలోని ఫూల్‌బాగ్ జగన్నాథ కల్యాణ మండపంలో ఓక్ జూబ్లీ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు తెలిపారు. సంఘ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మహాసభలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ రూపకల్పన వంటి సమీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. విద్యాప్రగతి, ఉపాధ్యాయ సంక్షేమం, సమాజశ్రేయస్సు, మహిళా సాధికారత, నూతన విద్యావిధానం వంటి అంశాల్లో చర్చలు, తీర్మానాలుంటాయని తెలిపారు. అనంతరం రాష్ట్ర మహాసభల ప్రచార పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎ.సదాశివరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.ఈశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు ఎం.బలరాంనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌వీ పైడిరాజు, మండల అధ్యక్షుడు సీహెచ్ పైడితల్లి, ఏపీ విద్యాపరిరక్షణ కోఆర్డినేటర్ కె.సత్యం, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

పందుల సంచారాన్ని ఉపేక్షించం..

విజయనగరం: జిల్లా కేంద్రంలో పందుల సంచారాన్ని ఉపేక్షించబోమని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి. నల్లనయ్య స్పష్టం చేశారు. స్థానిక పీఎస్ఆర్ కాలనీ పార్కులో పందుల పెంపకం విరివిగా జరుగుతోందని బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్ జాకీర్ హుస్సేన్ సభ దృష్టి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న కమిషనర్ పి.నల్లనయ్య తక్షణమే పందుల శిబిరాన్ని తొలగించాలని ప్రజారోగ్య సిబ్బందిని ఆదేశించారు. దీంతో గంటల వ్యవధిలోనే పీఎస్ఆర్ కాలనీ పార్క్‌లో ఉన్న పందుల శిబిరాన్ని ప్రజారోగ్య సిబ్బంది తొలగించారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రకళ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

మోతాదుకు మంచి ఎరువులు వాడొద్దు..

విజయనగరం రూరల్: వరి పంటలో మోతాదుకు మించి ఎరువులు వినియోగించరాదని మండల వ్యవసాయాధికారి హర్షలత తెలిపారు. మండలంలోని సారిక, జొన్నవలస గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రస్తుతం వరి పంటకు ఆకుముడత పురుగు ఆశిస్తోందన్నారు. దీని నివారణకు లీటర నీటికి 2.5 ఎంఎల్ క్లోరిపైరిఫోస్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఎ.డి భారతి, గ్రామ సర్పంచ్‌లు, పలువురు రైతులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం అర్బన్: గరివిడి, జియ్యన్నవలస ప్రాంతాలలో వీఎంఆర్‌డీఏ రూపొందించిన ఎన్‌టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్ లేఅవుట్లలో ఖాళీగా ఉన్న ఎంఐజీ ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మధ్య తరగతి ప్రజల సౌకర్యం కోసం విశాఖపట్నం మహానగర ప్రాంత అభివృద్ధి సంస్థ ఈ లేఅవుట్లను రూపొందించిందని పేర్కొన్నారు. గరివిడి లేఅవుట్‌లో ఎంఐజీ-1లో 87, ఎంఐజీ-2లో 81, ఎంఐజీ-3లో 43 ప్లాట్లను ఏర్పాట్లు చేశామని తెలిపారు. విజయనగరం సమీపంలోని బొండపల్లి మండలం జియ్యన్నవలస ప్రాంతంలో 12.31 ఎకరాల్లో 126 ప్లాట్లను రూపొందించామని తెలిపారు. వీటిలో ఇంకా 36 ప్లాట్లు మిగిలి ఉన్నాయన్నారు. ఇతర వివరాలకు విశాఖపట్నంలోని వీఎంఆర్‌డీఏ అధికారులు లేదా 77999 67589 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సమయపాలన పాటించాలి

నెల్లిమర్ల: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈఓ సూర్యనారాయణ మూర్తి, ఈపు విజయకుమార్ తెలిపారు. బుధవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, రెసిడెన్సియల్ ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ వారు ఇచ్చిన ఆదేశాల ప్రకారం పాఠశాలలో పని చేస్తున్న టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ సిబ్బంది కచ్చితంగా సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. అలాగే యూడైస్ అప్‌డేట్‌గా ఉండేలా చూసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండేలా పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

గురుకులం తనిఖీ ..


కొప్పెర్ల గురుకులంలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

పూసపాటిరేగ: మండలంలోని కొప్పెర్ల బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న బోధన, సౌకర్యాలపై ఆరా తీశారు. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఆయనతో పాటు మండల విద్యాశాఖాధికారులు రాజ్‌కుమార్, పాపినాయుడు, తదితరులు ఉన్నారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు


పారిశుధ్య కార్మికులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

విజయనగరం: స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక ఆనందగజపతి ఆడిటోరియంలో పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్పొరేషన్ కమిషనర్ పి. నల్లనయ్య ఆదేశాల మేరకు ప్రజారోగ్య అధికారులు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి మాట్లాడుతూ.. చెత్తాచెదారాలను శుభ్రం చేస్తున్న క్రమంలో కార్మికులు అనారోగ్యాలకు గురవుతుంటారని, ఈ నేపథ్యంలో వారిని ఆదుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుధ్య పనులు

విజయనగరం: స్వచ్ఛత హి సేవా కార్యక్రమాల్లో భాగంగా విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బుధవారం సామూహిక పారిశుధ్య పనులు చేపట్టారు. పదుల సంఖ్యలో పారిశుధ్య కార్మికులు కార్పొరేషన్ కార్యాలయం సమీపంలో గల ఎన్టీఆర్ విగ్రహం నుంచి గణేష్ కోవెల వరకు పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు.

అవంతిలో ఫార్మాసిస్ట్ దినోత్సవం



మాట్లాడుతున్న అంవతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భోగాపురం: మండలంలోని చెరుకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎంబీబీ రాజు ఆధ్వర్యంలో ప్రపంచ ఫార్మాసిస్ట్ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అవంతి విద్యా సంస్థల చైర్మన్, మాజీ శాసన సభ్యుడు ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఫార్మసీ రంగాన్ని తక్కువగా అంచనా వేయవద్దన్నారు. లక్ష్యంతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. సీఎంఎస్ లేబరేటరీస్ మేనేజింగ్ డైరెక్టర్ జి. జగదీశ్వరరావు మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యాలను బాగుచేయడంలో ఫార్మసిస్టులు ప్రత్యేక పాత్ర వహిస్తారని కొనియాడారు. కార్యక్రమంలో ఫార్మా డీ, బీ ఫార్మసీ, ఎం. ఫార్మసీ విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మల్బరీ సాగుకు ముందుకు రావాలి..

- జిల్లా పట్టు శాఖాధికారి ఏవీ సాల్మన్ రాజు


నెల్లిమర్ల రూరల్: రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా పట్టు శాఖాధికారి ఏవీ సాల్మన్‌రాజు

నెల్లిమర్ల రూరల్: రైతుల మల్బరీ సాగుపై మొగ్గు చూపాలని జిల్లా పట్టు శాఖాధికారి ఏవీ సాల్మన్‌రాజు అన్నారు. మండలంలోని సతివాడ, తంగుడుబిల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సతివాడలో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ.. పట్టు పురుగులు, మల్బరీ మొక్కల పెంపకంతో మంచి రాబడి ఉంటుందన్నారు. వ్యవసాయాధికారులు పూర్ణిమ, సంగీత మాట్లాడుతూ.. రైతులు విచ్చలవిడిగా ఎరువులు, పురుగుల మందులు ఉపయోగించకుండా సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులు వేయాలన్నారు. ఈ నెల 28లోపు రైతుసేవా కేంద్రాల్లో ఈకేవైసీ చేయించుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సత్యనారాయణ, ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రతినిధి వెంకటలక్ష్మి, పశు వైద్యాధికారి చంద్రశేఖర్, ఏఈఓ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నూతన సాగు పద్ధతులపై అవగాహన ..


భోగాపురం: నూతన పంట సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ

భోగాపురం: నూతన వ్యవసాయ సాగు పద్ధతులపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ శాఖాధికారి వి. హరికృష్ణ అన్నారు. మండలంలోని దల్లిపేటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో రైతులకు సాంకేతిక సమాచారం అందించడానికి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖాధికారి జ్యోత్స్న, రైతులు వీఏఏలు, తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడులు సాధించాలి


పూసపాటిరేగ : రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ జె.డి తారకరామారావు, తదితరులు

పూసపాటిరేగ : వరిసాగులో సాంకేతిక ఉపయోగించి అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ వీటీ రామారావు అన్నారు. మండలంలోని చల్లవానితోటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులందరూ సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించారు. సేంద్రియ వ్యవసాయం చేస్తే నాణ్యమైన దిగుబడులు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కొల్లి నీలిమ, పూసపాటిరేగ వ్యవసాయ మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ చిన్నమ్మలు, పశు వైద్యాధికారి సుధీర్, విస్తరణాధికారి జానకీదేవి, వ్యవసాయశాఖ అసిస్టెంట్ ప్రియాంక, ప్రజాప్రతినిధిలు పతివాడ శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.